సాక్షి కామారెడ్డి

సోమవారం ౹ 29 ౹ సెప్టెంబర్ ౹ 2025



తాళం వేసిన ఇళ్లే..

తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు నిజామాబాద్ సీపీ తెలిపారు.

- 8లో ▸



దుర్గాదేవీ నమోస్తుతే

జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. భక్తులు మండపాలలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.4 /21.8

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'గెలుపే లక్ష్యంగా పనిచేయాలి'



కామారెడ్డి టౌన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కార్యకర్తలకు సూచించారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన పదాధికారుల సమావేశంలో ఆయనమాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారైన నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధంగా ఉండాలన్నారు. కష్టపడి ప్రతి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లతో పాటు జెడ్పీ పీఠం కూడా బీజేపీ కైవసం చేసుకునేలా కష్టపడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, రాష్ట్ర నాయకులు మురళీధర్‌గౌడ్, పైడి ఎల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



ఆనంద్



మల్లేశ్

రామారెడ్డి: ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు ఆనంద్, మల్లేశ్‌లు జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ శివరాం తెలిపారు. గతనెలలో మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఆనంద్ జావలిన్‌త్రో లో, మల్లేశ్ 60 మీటర్ల పరుగు పందెంలో సత్తా చాటినందుకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. వీరు వచ్చేనెల 10 నుంచి 14 వరకు ఒడిషా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, పీడీ లింగం, పీఈటీ రవీంద్ర, కోచ్ సురేశ్ అభినందించారు.

ఎస్సారెస్పీ నుంచి 4.5 లక్షల క్యూసెక్కుల అవుట్ ఫ్లో



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి భారీగా నీటిని గోదావరిలోకి విడుదల చేస్తుండడంతో దిగువన గోదావరి ఉప్పొంగుతోంది. ఎగువ నుంచి భారీ వరదలు వస్తున్నాయనే సమాచారం మేరకు అధికారులు ప్రాజెక్ట్ నుంచి 39 వరద గేట్ల ద్వారా 4.5 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి 3.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఆదివారం రాత్రి వరకు వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 58 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కానీ నీటిని మరింత ఖాళీ చేయాలన్న ఉన్నతాధికారుల సూచనల మేరకు ఇన్‌ఫ్లో కన్నా అవుట్ ఫ్లోను ఎక్కువ చేశారు. నది పరీవాహక ప్రాంతాలైన మెండోరా మండలం దూదిగాం, కోడిచర్ల, చాకిర్యాల్, పోచంపాడ్, సావెల్ గ్రామాల్లో పంటలు నీట మునుగుతున్నాయి. ప్రాజెక్టు దిగువన ఉన్న వడ్డెర కాలనీలోకి భారీగా నీరు చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదలను మరింత పెంచే అవకాశం ఉండడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కోడిచర్ల, సావెల్ గ్రామాల మధ్య వంతెనపై నుంచి గోదావరి ప్రవహిస్తోంది. మెండోరా రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

జిల్లా జైలు సూపరింటెండెంట్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు!

ఖలీల్‌వాడి(నిజామాబాద్‌అర్బన్): నిజామాబాద్ జిల్లా జైలు సూపరింటెండెంట్ చింతల దశరథం మరోమారు లైంగిక వేధింపుల కేసులో ఇరుక్కున్నట్లు తెలుస్తుంది. గతంలో చర్లపల్లి జైలు జూనియర్ అసిస్టెంట్, ఖైదీ భార్యపై ఆయన లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. పోక్సో కేసు కూడా నమోదు అయ్యింది. తాజాగా కామారెడ్డి జైలు జూనియర్ అసిస్టెంట్‌ను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై జుడీషియల్ విచారణ జరుపుతున్నట్లు సమాచారం. కాగా ప్రస్తుతం చింతల దశరథం సెలవులో ఉన్నట్లు తెలిసింది.




ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన గోవర్ధన్(28) అనే యువకుడు అమెరికాలో చదువుకుని అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. మూడు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు.



మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌కు చెందిన కామటి ఎల్లయ్య(32) మూడు నెలల క్రితం బహ్రెయిన్ వెళ్లాడు. ఈనెల 12న ఛాతీలో నొప్పంటూ కుప్పకూలిపోయాడు. స్నేహితులు ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో చనిపోయాడు.



మాచారెడ్డి మండలంలోని లచ్చాపేట హైస్కూల్ టీచర్ వి.శ్రీనివాస్ (54)కు గతనెల 21న ఇంటి వద్ద గుండె నొప్పివచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఇలా చాలా మంది గుండె అర్ధంతరంగా ఆగిపోతోంది.





మద్నూర్ మండలం కుర్లాకు చెందిన వడ్ల యోగేశ్ (23) ఫిలిప్పీన్స్‌లో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. రెండు నెలల క్రితం ఛాతీలో నొప్పిరావడంతో స్నేహితులు ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గ మధ్యలో కన్నుమూశాడు.

ఉద్యోగం, వృత్తులు, వ్యాపారం... ఏ రంగంలోనైనా ఒత్తిళ్లు పెరిగాయి. దీనికి తోడు ఆహారపు అలవాట్లు, అనవసరపు ఆందోళనలు, ఆల్కహాల్, స్మోకింగ్ తదితర కారణాలతో గుండె సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో నిబ్బరాన్ని కోల్పోతున్న గుండె వయసుతో నిమిత్తం లేకుండా మొరాయిస్తోంది. దీంతో ఆస్పత్రులకు చేరేలోగానే పలువురు మృత్యువాత పడుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

మంచి జీవన శైలి అలవర్చుకోవాలి



శారీరక శ్రమ లేకపోవడం, అధిక కొలెస్ట్రాల్ ఉన్న ఆహారం తీసుకోవడం, మత్తు పదార్థాలు, ధూమపానం వంటి వాటితో అనేక రకాల సమస్యలు ఎదురవుతున్నాయి. అందుకే అలవాట్లను మార్చుకోవాలి. ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం చేయాలి. నడకతో గుండె మీద భారాన్ని తగ్గించుకోవచ్చు. బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ ఎక్కువ ఉన్నవారు వాటిని అదుపులో ఉంచుకునేందుకు వైద్యుల సలహాలు పాటిస్తే గుండె జబ్బుల బారిన పడకుండా ఉండొచ్చు.

– శరత్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ వైద్యకళాశాల, కామారెడ్డి

గుండె పోటెత్తుతోంది!



- చిన్న వయసులోనే గుండె సంబంధిత సమస్యల బారిన పడుతున్న జనం
- సడెన్ కార్డియాక్ అరెస్ట్‌తో చాలామంది మృత్యువాత
- నేడు వరల్డ్ హార్ట్ డే

జిల్లాలో ఏడాదికేడాది గుండెవ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. గుండె సమస్యల బారిన పడిన వారు ఆస్పత్రికి వెళ్లి చూపించుకుంటే వాల్వ్ బ్లాక్ అయిన విషయం బయటపడి స్టంట్లు వేయడమో, లేదంటే ఓపెన్ హార్ట్ సర్జరీ చేయడమో జరుగుతోంది. అయితే సడెన్ కార్డియాక్ అరెస్టు జరిగినపుడు క్షణాల్లో ప్రాణాలు పోతున్నాయి. ఇటీవల జరుగుతున్న మరణాల్లో ఎక్కువగా సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు సంబంధించినవే ఎక్కువగా ఉంటుండడం ఆందోళన కలిగిస్తోంది. చాలామంది వృత్తిపరమైన, కుటుంబ, ఆర్థిక సమస్యలతో ఒత్తిళ్లకు లోనవవుతున్నారు. అలాంటి వారే ఎక్కువగా గుండె సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే బయటి ఆహారం తీసుకోవడం వల్ల కూడా సమస్యలు వస్తున్నాయి. వారంలో రెండు మూడు రోజులు బయటికి వెళ్లి తినే అలవాటు నేటి జనరేషన్‌లో పెరిగిపోయింది. దీంతో ఆహార పదార్థాల తయారీలో వాడుతున్న నూనెలు, మసాలాలతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

జీవన శైలిలో మార్పులు...

చాలా మంది అర్ధరాత్రి వరకు పడుకోకుండా బయట తిరుగుతుంటారు. సరైన నిద్ర లేకపోవడం, దానికి తోడు వ్యాయామం చేయకపోవడం వంటి కారణాలతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తిండి విషయంలో జాగ్రత్తలు పాటించడం లేదు. మద్యం, సిగరెట్లు, ఇతర వ్యసనాలు కూడా సమస్యలకు కారణమవుతున్నాయి. కుటుంబ సమస్యలంటూ, ఆర్థిక సమస్యలంటూ పీకలదాకా తాగి ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్న వారు ఎందరో ఉన్నారు. జీవన శైలిలో జరుగుతున్న మార్పులు ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నాయి. గుండె సమస్యలకు అనేక కారణాలు ఉంటున్నాయని వైద్యులు అంటున్నారు. ముఖ్యంగా చాలా మంది అనవసర ఒత్తిళ్లతో గుండె సమస్యల బారిన పడుతున్నారంటున్నారు. ప్రతి ఒక్కరూ ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. రోజూ కనీసం వాకింగ్ గానీ, మరే రకమైన వ్యాయామమైనా చేయాలని పేర్కొంటున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం ఉన్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

వీడని ముసురు

- మూడు రోజులుగా జల్లులు
- అక్కడక్కడ భారీ వర్షాలు
- దెబ్బతింటున్న పంటలు



నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : అల్పపీడనం ప్రభావంతో ఆదివారం సైతం జిల్లా అంతటా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. మూడు రోజులుగా కొన్ని ప్రాంతాల్లో ముసురు పెట్టింది. కొన్నిచోట్ల జల్లులు, ఇంకొన్ని చోట్ల భారీ వర్షం కురిసింది. దీంతో వాగుల్లో ప్రవాహం మరింత పెరిగింది. చెరువులు, ప్రాజెక్టుల్లోకి వరద పోటెత్తడంతో అలుగులు పారుతున్నాయి. మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. జిల్లాలోని వివిధ వాగుల్లోనూ వరద ప్రవాహం ఎక్కువగా ఉంది. పోచారం, కౌలాస్‌నాలా, నిజాంసాగర్ ప్రాజెక్టులలోకి భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లా అంతటా వర్షం కురిసింది.

కామారెడ్డి చెరువులోకి భారీగా నీరు..

జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువుకు భారీగా వరద వస్తోంది. ఎగువన కృష్ణాజీవాడి, లింగాపూర్‌లలో శనివారం రాత్రి భారీ వర్షం కురవడంతో చెరువుకు వరద పెరిగి అలుగు ఉధృతంగా పారుతోంది. గత నెలాఖరులో చెరువు అలుగు ప్రవాహం పెరిగి, వరదతో జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీ, హౌసింగ్ బోర్డు ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగిన విషయం తెలిసిందే.

జిల్లాలోని పలు ప్రాంతాలలో రికార్డయిన వర్షపాతం వివరాలు..

లొకేషన్	వర్షపాతం (మి.మీ.)		
		కలెక్టరేట్	39.8
		దోమకొండ	39.8
అర్గొండ	74.0	తాడ్వాయి	36.3
నస్రుల్లాబాద్	57.3	రామారెడ్డి	36.0
బొమ్మన్‌దేవ్‌పల్లి	53.8	ఇసాయిపేట	31.5
జుక్కల్	43.0	పుల్కల్	31.5
కొల్లూర్	41.8	జిర్కూర్	30.0

నిజాంసాగర్‌లోకి భారీ వరద

- ఇన్‌ఫ్లో 1.30 లక్షల క్యూసెక్కులు
- అవుట్‌ఫ్లో 1.51 లక్షల క్యూసెక్కులు

నిజాంసాగర్: ఎగువన ఉన్న సింగూరు ప్రాజెక్టు, హల్దీవాగు, ఘనపురం ఆనకట్టతో పాటు పోచారం ప్రాజెక్టు పొంగి పొర్లుతుండడంతో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద పోటెత్తింది. ఆదివారం సాయంత్రం ప్రాజెక్టులోకి 1.30 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 21 వరద గేట్లను ఎత్తి 1.51 లక్షల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రధాన కాలువకు 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1,401.40 అడుగుల (12.954 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

సింగూర్‌లోకి..

ఎగువన కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న వర్షాలతో సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలాశయానికి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు 10 వరద గేట్లను ఎత్తి 96,604 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు.

కౌలాస్‌లోకి 6,285 క్యూసెక్కులు..

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టులోకి ఆదివారం సాయంత్రం 6,285 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు (1.237 టీఎంసీలు) కాగా.. ఆదివారం సాయంత్రానికి 457.60 మీటర్ల (1.141 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

మంజీరలో వరద ఉధృతి..

నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి 1.40 లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండడంతో పాటు నల్లవాగు, సింగితం, కల్యాణి ప్రాజెక్టుల వరద నీరు కూడా నదిని చేరుతోంది. దీంతో మంజీర 2 లక్షల క్యూసెక్కుల నీటితో ప్రవహిస్తోంది. నది పరీవాహన ప్రాంతంలోని పంటలు నీటమునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కుళ్లిపోతున్న పంట



మద్నూర్ రైతువేదిక వద్ద కుళ్లిపోయిన సోయా పంటను చూపిస్తున్న రైతులు

మద్నూర్: వరుసగా కురుస్తున్న వర్షాలతో పంట కుళ్లిపోతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నోటికాడికి వచ్చిన ముద్ద వర్షంలో కొట్టుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పలువురు రైతులు కుళ్లిపోయిన సోయా దంట్లను తీసుకుని మండల కేంద్రంలోని రైతు వేదిక వద్దకు తరలివచ్చారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పోచారం ప్రాజెక్టులోకి..



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టుకు వరదనీటి తాకిడి పెరిగింది. ఆదివారం సాయంత్రం ప్రాజెక్టులోకి 5,433 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అంతేమోతాదులో వరదనీరు ప్రాజెక్టు అలుగు పైనుంచి దిగువకు ప్రవహిస్తూ మంజీరనదిలో కలుస్తోంది.

సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టాలి



మద్నూర్‌లో పథ సంచలన్ నిర్వహిస్తున్న స్వయంసేవకులు

- ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రచారక్ శివకుమార్
- మద్నూర్‌లో ఘనంగా సంఘ్ శతాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న శివకుమార్

మద్నూర్: భారతదేశపు ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టాలని ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ నర్రా శివకుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గురు ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు ఐదు వందల మంది స్వయం సేవకులు మండల కేంద్రంలోని ప్రధాన వీధులలో పథ సంచలన్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివకుమార్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్‌ను 1925లో విజయదశమి రోజున హెడ్గేవార్ స్థాపించారన్నారు. ప్రస్తుతం శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్నామన్నారు. ప్రతి మనిషిలో భగవంతుడు ఉన్నాడని, ఎవరినీ తక్కువ చేసి చూడవద్దని పేర్కొన్నారు. హిందుత్వంలో అంటరానితనం లేదని స్వామి వివేకానంద చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ పాటించే పంచ పరివర్తన్‌లో మొదటిది సమరసత అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటోందని, విపత్కర పరిస్థితులలో పునర్నిర్మాణ కార్యక్రమాల్లోనూ సేవలందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిదులు హన్మండ్లు, నరేష్, నాందేవ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



కేసు వివరాలు తెలుపుతున్న డీఎస్పీ విఠల్‌రెడ్డి

బాన్సువాడ : మహిళను బెదిరించి బంగారం, నగదు దొంగలించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తెల్గాపూర్ గ్రామానికి చెందిన మేడిపల్లి లక్ష్మిని ఈనెల 19న కొండాపూర్‌కు చెందిన నీరడి సాయిలు బాన్సువాడలోని పోచమ్మ గల్లీకి పిలిపించి ఆమె వద్ద ఉన్న రూ.50 వేల నగదు, అరతులం బంగారు హారం, సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. బాధితురాలు బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు.. సీసీ ఫుటేజీలను పరిశీలించి నీరడి సాయిలును తాడ్కోల్ చౌరస్తా వద్ద పట్టుకున్నారు. దొంగలించిన బంగారాన్ని బుర్ర వెంకటరమణకు అమ్మినట్లు నిందితుడు అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు. వెంకటరమణ వద్ద 11 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామన్నారు. నీరడి సాయిలు, బుర్ర వెంకటరమణలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. సాయిలుపై గతంలో బాన్సువాడ, లింగంపేట్, నిజాంసాగర్, అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. తక్కువ సమయంలో కేసును ఛేదించిన సీఐ అశోక్, సిబ్బందిని ఎస్పీ అభినందించారని డీఎస్పీ తెలిపారు.

క్లుప్తంగా

గ్రూపు-2 ఉద్యోగాలకు ఎంపిక


బాజ సంతోష్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన బాజ సంతోష్ గ్రూపు-2 ఉద్యోగానికి ఎంపికైనట్లు ఆదివారం తెలిపారు. గ్రూపు-2 ఫలితాల్లో జేడబ్ల్యూసీఎస్, డబ్ల్యూఎస్‌సీ సెక్షన్‌లో ప్రొబిషన్ అధికారిగా ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. సంతోష్ ప్రస్తుతం దోమకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అలాగే మండలంలోని మోతె గ్రామానికి చెందిన పాతూరి సతీష్‌కుమార్ గ్రూపు-2 ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు. సతీష్‌కుమార్ ప్రస్తుతం లింగంపేట మండలం పొల్కంపేట తండాలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గ్రూప్-2లో ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికై నట్లు ఆయన తెలిపారు.

బావి ఒక్కటి.. నీటి కనెక్షన్లు ఎన్నో



రామారెడ్డి: మండలంలోని గిద్ద గ్రామంలో ఓ పురాతన బావి ఉంది. ఈ బావిలో నీళ్లు ఎండాకాలంలో కూడా ఇంకిపోవు. ఈ బావి గ్రామంలో ఎంతో మందికి నీటి అవసరాలను తీరుస్తుంది. ఎండాకాలంలో ఈ బావి గ్రామస్తులకు వరప్రదాయినిగా నిలుస్తోందని పేర్కొంటున్నారు. ఈ బావిలో స్థానికులు సుమారు 20 నుంచి 30 వరకు చిన్న మోటార్లను దింపేసి పైపుల ద్వారా ఇళ్లకు నీళ్లను సరఫరా చేసుకుంటున్నారు. బావి వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు, పైప్‌లైన్లను అటుగా వెళ్లేవారు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ దృశ్యాన్ని ఆదివారం సాక్షి క్లిక్‌మనిపించింది.

ఆర్‌ఎస్‌ఎస్ విజయదశమి ఉత్సవం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి, లింగాపూర్, చిన్నమల్లారెడ్డి గ్రామాల్లో ఆదివారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ధి ఉత్సవం సందర్భంగా విజయదశమి ఉత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ్ ప్రతినిధులు ఆయుధ పూజ చేశారు. వక్తలు విద్యా భారతి, అయాచితుల లక్ష్మణ్‌రావు, నరేందర్‌రెడ్డి, పటోళ్ల సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ పంచ పరివర్తనను ప్రతి పౌరుడు పాటించాలన్నారు. స్వదేశీ అనేది అందరిలో దేశభక్తిగా పెంపొందాలని పిలుపు నిచ్చారు. సంఘ్ ప్రతినిధులు బొడ్డు శంకర్, కొమిరెడ్డి స్వామి, అంతిరెడ్డి, ఎల్లయ్య, తమ్మలి మోహన్ పాల్గొన్నారు.

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు ఘనంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం అట్ల బతుకమ్మ, సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా మండలాలు, గ్రామాల్లో మహిళలు ఉదయం నుంచే వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం వేళ బతుకమ్మల ను ప్రధాన కూడళ్లు, రోడ్లపై ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు, యువతులు వాటిచుట్టూ బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యం చేశారు. పలుచోట్ల మహిళలు కోలాటం ఆడుతూ సందడి చేశారు. అనంతరం స్థానిక చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అస్ట్రేలియాలో దేశంలో హిందూ మహాసభ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన రాజశేఖర్, సౌజన్య, అఖిలతో పాటు జిల్లా వాసులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.


బీర్కూర్‌లో..


సుల్తాన్‌నగర్‌లో..


బేగంపూర్ గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు


గౌరారంలో..


భిక్కనూరులో..






బతుకమ్మతో మహిళ, చిన్నారులు


పెద్దమల్లారెడ్డిలో..


అస్ట్రేలియాలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న జిల్లా వాసులు

జిల్లా కేంద్రంలో 'పూల' సందడి



కామారెడ్డి టౌన్: జిల్లాలో సద్దుల బతుకమ్మ పండుగను సోమవారం జరుపుకోనున్నారు. ఈక్రమంలో ఆదివారం జిల్లాకేంద్రంలోని మార్కెట్‌లో పూల కొనుగోళ్లతో సందడి నెలకొంది. జిల్లా కేంద్రంలోని సుభాష్‌రోడ్, జేపీఎన్ రోడ్ అంతటా గునక, తంగెడు, తదితర పూల కేంద్రాలు వెలియగా విక్రయాలు జోరుగా సాగాయి. వ్యాపారులు పండుగ నేపథ్యంలో పూలను అధిక ధరలకు విక్రయించడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

ఎల్లారెడ్డిలో నేడు సద్దుల బతుకమ్మ..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో నేడు సద్దుల బతుకమ్మ పండుగను నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. పట్టణంలోని పెద్ద చెరువుకట్ట, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొచ్చెరువు, ఆజాద్‌గ్రౌండ్, రాజుల కుంట వద్ద బతుకమ్మ ఆటలను ఆడి బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేయాలని వారు కోరారు. పండుగకు సంబంధించి ప్రజల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

గాంధారిలో..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో నేడు నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలను ప్రజలు రోడ్డుపైనే జరుపుకోవాలని గ్రామ కార్యదర్శి కోరారు. వర్షాల కారణంగా వాగు వద్ద వేడుకలు నిర్వహించేందుకు అనుకూలంగా లేదన్నారు. రోడ్డుపైనే ఒక పక్కన వేడులకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

బతుకమ్మ పాట



బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
పూల బతుకమ్మ ఉయ్యాలో
పండుగ బతుకమ్మ ఉయ్యాలో
అద్దాల బతుకమ్మ ఉయ్యాలో
ఆద బతుకమ్మ ఉయ్యాలో
అలంకార బతుకమ్మ ఉయ్యాలో
పూల తోరణాల బతుకమ్మ ఉయ్యాలో
గన్నేరు గజ్జల బతుకమ్మ ఉయ్యాలో
గోరింటాకు పూసిన బతుకమ్మ ఉయ్యాలో
గోదారి జలాల బతుకమ్మ ఉయ్యాలో
గోపురాల వెలుగు బతుకమ్మ ఉయ్యాలో
చెంపకూల బతుకమ్మ ఉయ్యాలో
చెరువుల కట్టేలా బతుకమ్మ ఉయ్యాలో
చిరునవ్వుల బతుకమ్మ ఉయ్యాలో
తంగేడు పూల బతుకమ్మ ఉయ్యాలో
తాళ్లచెట్టు బతుకమ్మ ఉయ్యాలో
తెలంగాణ తల్లి బతుకమ్మ ఉయ్యాలో
తల్లిదండ్రుల ఆశీర్వాద బతుకమ్మ ఉయ్యాలో
మల్లెలు ముత్యాల బతుకమ్మ ఉయ్యాలో
మట్టి వాసన బతుకమ్మ ఉయ్యాలో
బతుకమ్మ వచ్చింది ఉయ్యాలో
బతుకమ్మ గెలిచింది ఉయ్యాలో
బతుకమ్మ పండుగ ఉయ్యాలో
బతుకమ్మ జయహో ఉయ్యాలో!!

- డాక్టర్.సాహితీ వైద్య, టొరంటో కెనడా

ప్రకృతి మురిసేలా.. సంస్కృతి, సంప్రదాయానికి అద్దంపట్టేలా బతుకమ్మ పాట రాసే మహిళలకు ఇదే మా ఆహ్వానం. మీ పాటలను పంపాల్సిన వాట్సాప్ నంబర్

8332887332

ఏకధాటి వర్షాలు.. నీటమునుగుతున్న పంటలు


గుండార ం పరిధిలో దెబ్బతిన్న వరి పంట

- ఆందోళనలో అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

రాజంపేట: నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు రైతులకు భారీ నష్టాన్ని మిగిల్చగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చేతికొచ్చిన పంటలు నీటమునుగుతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.వేల పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తుంటే నిత్యం కురుస్తున్న వర్షాల వల్ల పొలాలు నీటమునుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలుచోట్ల మొక్కజొన్న పంటలు నీరు పట్టి దెబ్బతినగా, వరి పంటలు సైతం చేతికి అందేలా లేదని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నష్టపరిహారం అందిస్తే తప్ప కోలుకునే పరిస్థితి లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పొలంలో ఇసుకమేటలు ఏర్పడ్డాయి..



నాలుగున్నర ఎకరాలలో వరి పంట సాగు చేస్తున్నాను. గతంలో కురిసిన వర్షాలకు వరి పంట చాలా వరకు దెబ్బతిన్నది. పొలం పక్కన కాలువ ఉండటంతో వరద నీరు ఉధృతంగా వస్తుండటంతో పంట మునిగిపోతుంది. పొలంలో ఇసుకమేటలు ఏర్పడ్డాయి. ఏమి చేయాలో తోచడం లేదు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.

–రాజిరెడ్డి, రైతు, శివాయిపల్లి

ముంపుప్రాంతాల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వెంకంపల్లి, తాండూర్, బంజరప్రాంతంలో వరదనీటితో ముంపునకు గురైనప్రాంతాలను ఆదివారం ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా వెంకంపల్లి, తాండూర్ శివారులో వరద నీటితో మునిగిన పంటలను రైతులతో కలిసి సందర్శించారు. వెంకంపల్లి సమీపంలోని బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరనదిని, బంజర సమీపంలో జాతీయ రహదారికి ఇరువైపులా వచ్చిన వరదనీటిని పరిశీలించారు. వరదనీరు రహదారి పైకి చేరకుండా అడ్డుగా మట్టికట్టలు వేయాలని హైవే సిబ్బందికి ఆయన సూచించారు. వరద మరింత పెరిగే అవకాశం ఉందని, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.


బంజర సమీపంలో జాతీయ రహదారి అంచున చేరిన వరదను పరిశీలిస్తున్న అధికారులు

క్రైం కార్నర్

అప్పులబాధతో యువకుని ఆత్మహత్య


రమేశ్(ఫైల్)

మాచారెడ్డి: అప్పుల బాధతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చుక్కాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అనాచి రమేశ్(32) ఇటీవల ఇంటి నిర్మాణం కోసం ప్రైవేట్ ఫైనాన్స్‌లతోపాటు మహిళా సంఘాల వద్ద అప్పు చేశాడు. మొత్తం రూ.15 లక్షల వరకు అప్పులయ్యాయి. మూడు రోజుల కిందట ఫైనాన్షియర్లు ఇంటి విషయంలో ఎలాంటి లావాదేవీలు చేయొద్దని ఇంటికి నోటీస్ అతికించి వెళ్లారు. దీంతో ఈఎంఐలు కట్టలేక మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొద్దిరోజులుగా భార్యా,పిల్లలతో కామారెడ్డిలో నివాసముంటున్న రమేశ్ శనివారం రాత్రి చుక్కాపూర్ వచ్చి బలవన్మరణానికి పాల్పడటంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య సంధ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మనస్తాపంతో మహిళ..

రాజంపేట: మనస్తాపంతో ఉరేసుకొని మహిళ మృతి చెందిన ఘటన రాజంపేట మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తోడెంగల మల్లేశం 18 సంవత్సరాల క్రితం తన మొదటి భార్య చనిపోవడంతో సిద్దవ్వను పెళ్లి చేసుకున్నాడు. 6 నెలల క్రితం అనారోగ్యంతో మల్లేశం చనిపోవడంతో సిద్దవ్వ తరచూ మనోవేదనకు గురయ్యేది. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో ఉన్న సోదరి ఇంటికి వెళ్లిన ఆమె శనివారం సాయంత్రం రాజంపేటకు వచ్చింది. రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నారు. కుటుంబసభ్యులు ఉదయం 7 గంటల ప్రాంతంలో సిద్దవ్వ గదిని తెరిచిచూడగా దూలానికి ఉరేసుకొని కనిపించింది. సోదరుడు ముత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమేశ్ తెలిపారు.

మేనత్త అంత్యక్రియలు జరిగిన కొద్దిసేపటికే..

- ట్రాక్టర్‌ను ఢీకొన్న టిప్పర్..
- రోడ్డు పక్కన స్కూటీపై ఉన్న వ్యక్తిపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్
- కోమట్‌పల్లి వాసి దుర్మరణం


రాజేంద్రప్రసాద్ మృతదేహం

డొంకేశ్వర్(ఆర్మూర్): మేనత్త అంత్యక్రియలు పూర్తిచేసిన కొద్దిసేపటికే అనుకోని ప్రమాదంలో అల్లుడు మరణించిన సంఘటన డొంకేశ్వర్ మండలం కోమట్‌పల్లిలో చోటు చేసుకుంది. కోమట్‌పల్లి గ్రామానికి చెందిన చీనోళ్ల రాజేంద్ర ప్రసాద్ (44) వ్యవసాయం చేస్తుంటాడు. ఆదివారం తన మేనత్త ఎర్రక్క చనిపోవడంతో ఆమె అంత్యక్రియలు గ్రామంలోనే నిర్వహించారు. మేనత్త అంత్యక్రియలు పూర్తిచేసి ఇంటికి వచ్చిన రాజేంద్రప్రసాద్ ఇంటి బయట రోడ్డు పక్కన తన స్కూటీపై కూర్చున్నాడు. అదే సమయంలో నికాల్‌పూర్ నుంచి కోమట్‌పల్లి మీదుగా శాపూర్‌కు వెళ్తున్న ఓ టిప్పర్ ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ముందుకు జరిగి స్కూటీపై ఉన్న రాజేంద్రప్రసాద్ పైకి వచ్చింది. ట్రాక్టర్ చక్రాలు అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మరణించాడు. ప్రమాదాన్ని చూసిన వారంతా ఉలిక్కిపడ్డారు. మేనత్త చనిపోయిన రోజునే అల్లుడు కూడా మరణించడం అందరినీ కలచివేసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..


దినేశ్(ఫైల్)

వేల్పూర్: వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదుట 63 నెంబర్ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన అల్లకుంట దినేశ్(26) మరణించినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. దినేశ్ అతని స్నేహితులు కార్తీక్, రాజ్‌కుమార్‌తో కలిసి డ్యూక్ బైక్‌పై లక్కోర నుంచి మోర్తాడ్ వైపు వెళ్తుండగా, వేల్పూర్ ఏఎంసీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో దినేశ్ అక్కడికక్కడే మరణించాడు. తీవ్రంగా గాయపడ్డ కార్తీక్, రాజ్‌కుమార్‌లను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన దినేశ్ సెలవుపై గత నెలలో ఇంటికి వచ్చాడు. తిరిగి గల్ఫ్ వెళ్లాల్సి ఉండగా ప్రమాదంలో చనిపోయాడు. మృతుడికి ఒక సోదరి ఉండగా, ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రులు, బంధువులు గుండెలవిసేలా రోదించారు.

మహమ్మదీయకాలనీలో చోరీ



ఖలీల్‌వాడి: నగరంలోని మహమ్మదీయ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు. మహమ్మద్ షకీర్ తన ఇంటికి తాళం వేసి రెండ్రోజుల క్రితం బంధువుల ఫంక్షన్‌కు వెళ్లాడు. ఆదివారం ఇంటికి చేరుకున్న కుటుంబీకులకు తాళం పగులగొట్టబడి కనిపించింది. అనుమానంతో పరిశీలించగా బెడ్రూంలో ఉన్న తులంన్నర బంగారం, 15 గ్రాముల వెండి, రూ.1.50 లక్షలు అపహరణకు గురైనట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భూంపల్లిలో నాలుగు ఇళ్లలో..



సదాశివ నగర్ (ఎల్లారెడ్డి): మండలంలోని భూంపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. దుండగులు బీరువాలను పగులగొట్టి వెండి, బంగారు వస్తువులు, నగదును ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని సీఐ సంతోష్ కుమార్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీం ద్వారా వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

దేశీదారు పట్టివేత



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో మహారాష్ట్రకు చెందిన దేశీదారు పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ ఆదివా రం తెలిపారు. పిట్లం మండలం బండపల్లి గ్రామానికి చెందిన మేదరి గంగారాం మహా రాష్ట్ర నుంచి బైక్‌పై దేశీదారు తీసుకొస్తున్నార ని సమాచారం మేరకు బిచ్కుంద బస్టాండ్ వద్ద కాపుకాచి పట్టుకొని 8 దేశీదారు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గంగారాంను పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఎక్సెల్ వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఒకరి మృతి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గేట్ వద్ద ఎక్సెల్ వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు స్థానికులు ఆదివారం తెలిపారు. మహ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామానికి చెందిన గూల చిన్న అంజయ్య (47) నిజాంసాగర్ నుంచి నర్వకు వెళ్తుండగా, బాన్సువాడ నుంచి ఎల్లారెడ్డికి వస్తున్న ఆర్టీసీ బస్సు ఎక్సెల్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఘటనా స్థలంలోనే అంజయ్య మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగతనాలు


స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న సీపీ


వివరాలు వెల్లడిస్తున్న సీపీ సాయిచైతన్య, పక్కన ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, సీఐ

- జల్సాలకు అలవాటు పడిన దొంగల ముఠా
- ముగ్గురు పరారీ, ఇద్దరు అరెస్ట్
- 31 తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడే ముఠాకు చెందిన సభ్యులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 23న నగరంలోని నాగారం బ్రాహ్మణకాలనీలోని పూజారి వేలేటి పవన్ శర్మ ఇంట్లో చొరబడిన దుండగులు సుమారు 33 తులాల బంగారం, 25 తులాల వెండి, రూ. 30 వేల నగదు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు నగరంలోని ధర్మపురిహిల్స్ డ్రైవర్స్‌కాలనీకి చెందిన షేక్‌సల్మాన్ అలియాస్ సోనూ, దొడ్డికొమురయ్య కాలనీకి చెందిన మరాఠి ఆకాశ్‌రావు నాగారంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల చౌరస్తా వద్ద ఆటోలో అనుమానాస్పదంగా వెళుతుండగా పోలీసులు పట్టుకొని విచారించారు. షేక్‌సల్మాన్ అలియాస్ సోనూ వద్ద 31 తులాల బంగారం, మరాఠి ఆకాశ్‌రావు వద్ద దొంగతనానికి ఉపయోగించిన ఆటో, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరినీ విచారించగా ఐదుగురు సభ్యులు కలిసి దొంగల ముఠా ఏర్పడిందని, ముఠాకు నాయకుడు షేక్ సాదక్ అని తెలిపారు. సాదక్‌కు గంజాయి అలవాటు ఉందని, దొంగతనాలకు స్కెచ్ వేస్తాడన్నారు. వినోద్ చౌహాన్, ముక్తే సాయినాథ్, షేక్ సాదక్ కలిసి దొంగతనాలు చేస్తారని, ముగ్గురిపై నగరంలోని పోలీస్‌స్టేషన్‌లలో దొంగతనాల కేసులు ఉన్నట్లు వివరించారు. ప్రస్తుతం ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీపీ తెలిపారు. ఈ ముఠా జల్సాలకు అలవాటు పడి డబ్బు సరిపోక దొంగతనాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేసును ఛేదించిన కానిస్టేబుళ్లను సీపీ అభినందించి, రివార్డ్ అందజేశారు. సమావేశంలో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, నార్త్ సీఐ బూస శ్రీనివాస్, ఎస్సై గంగాధర్ పాల్గొన్నారు.

గొర్రెను చంపిన చిరుత?


మేడిపల్లి అటవీ ప్రాంతంలో గొర్రె కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని మేడిపల్లి, గౌరారం అటవీ ప్రాంతంతో మూడు రోజుల క్రితం చిరుతపులి గొర్రెపై దాడి చేసి హతమార్చినట్లు గ్రామస్తులు తెలిపారు. మేడిపల్లి గ్రామానికి చెందిన కురమ సంతోష్ తన గొర్రెలను మేపడానికి అడవికి తీసుకెళ్లాడు. అయితే, ఇటీవలే కొనులుగోలు చేసిన విత్తన పోటేలు అడవిలో తప్పిపోయింది. రెండురోజుల క్రితం మేడిపల్లి శివారులో గొర్రె కళేబరం కనిపించడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంతోష్ ఫిర్యాదు మేరకు ఫారెస్టు బీట్ అధికారి హన్మాండ్లు మరో అధికారితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా చేసి ఫారెస్టు సెక్షన్ అధికారి సునీతకు సమాచారం ఇచ్చారు. సెక్షన్ అధికారి సునీత పరిశీలించిపై అధికారులకు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. అడవిలో గడ్డి ఏపుగా పెరిగినందున గొర్రెపై దాడి చేసింది ఏ జంతువో కచ్చితంగా చెప్పలేమన్నారు. వెటర్నరీ డాక్టర్ రిపోర్టు ఆధారంగా నిర్ధారణ చేస్తామన్నారు. గౌరారం, మేడిపల్లి అటవీ ప్రాంతంలో చిరుతలున్నాయని, పశువులు, గొర్రెల కాపరులు జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు.

మహిళ అదృశ్యం

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన స్వప్న అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ ఆదివారం తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు తన భర్తతో చిన్న గొడవ కావడంతో పాపతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది.భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.